క్లుప్తంగా

తిరుమలనాథస్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకారంలో తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండల పరిధిలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామ సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత గొ్రాలికొండ తిరుమలనాథస్వామి దేవాలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు శనివారం చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి, అమ్మవారికి వారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి వద్ద దంపతులు కుంకుమార్చన, పూజలు చేశారు. సంతానం లేని దంపతులు సంతానం కలగాలని ఆలయం వెనకాల ఉన్న గిరికొండ చుట్టూ ప్రదక్షిణలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామి, అమ్మవారిని వారిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నీటి సమస్యపై మహిళల ఆందోళన

మార్కాపురం: మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని 27వ బ్లాక్‌లో బోరుచెడిపోయి మూడు నెలలైందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ క్శొట్టి నగేష్, వార్డు మహిళలు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ స్థానిక వివేకానంద స్కూల్ వద్ద డీప్‌బోరు మరమ్మత్తులకు గురై మూడు నెలలైందని సబ్‌కలెక్టర్, మున్సిపల్ కమిషనరు, ఏఈ తదితరులకు చెప్పినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. తమపై ఎందుకింత వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. అధికారులు రెండు లేదా మూడు రోజుల్లో పరిష్కరించకపోతే వార్డు ప్రజలందరితో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ విషయమై మున్సిపల్ ఏఈ భూపాల్‌రెడ్డిని వివరణ కోరగా.. ఆ వార్డులో బోరు ఏర్పాటు కోసం కౌన్సిల్‌లో తీర్మానం పెట్టామని వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.


నీళ్ల కోసం నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్ నగేష్, పక్కన మహిళలు

పల్లెల్లో పారిశుధ్యం దుర్భరం



ఎస్సీ కాలనీ రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు నీరు


గ్రామంలో దక్షిణ బజారులో రోడ్డుపై మురుగు

● దోమలు ఉధృతితో వ్యాధుల వ్యాప్తి

పెద్దారవీడు: కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో పారిశుధ్య చర్యలను పట్టించుకోవడం లేదు. నాయకులు, అధికారుల నిర్లక్ష్య వైఖరితో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. మండలంలోని గ్రామాల్లో కాలువల వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు నిలిచి దోమల బెడద ఎక్కువైంది. చిన్నపాటి వర్షం కురిసినా నీరు వెళ్లేందుకు అవకాశం లేక ఇళ్ల మధ్యలోనే నిలుస్తున్నాయి. మురుగు నీరు రోడ్లపై నుంచి బయటికి వెళ్లాలంటే కాలువలు ఎక్కడా లేవు. ప్రజలు ఇళ్ల నుంచి బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో వారానికి ఒక రోజు వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ అధికారులతో కలిసి ప్రతి శుక్రవారం పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని నిబంధన ఉన్నా క్షేత్రస్థాయిలో పెద్దగా మార్పు కనిపించడం లేదు. మండలంలో బద్వీడుచెర్లోపల్లి గ్రామంలో కాలువలు లేకపోవడంతో రోడ్లపై మురుగు నీరు ఉన్న ప్రదేశాల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో అనేక మంది రోగాల బారిన పడుతున్నారు. వైరల్ జ్వరాలు, మలేరియా, చికున్‌గున్యా, తదితర వ్యాధులు బారిన పడ్డామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికే గ్రామంలో దాదాపు 10 మంది జ్వరాలతో మంచాన పడ్డారు. గ్రామాల్లో రోగులకు నాణ్యమైన వైద్య చికిత్సలు అందించాలన్న సంకల్పంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జ్వరాలు సోకిన వారిని ఆరోగ్య సిబ్బంది పట్టించుకోకపోవడంతో పెద్దదోర్నాల, మార్కాపురం ప్రాంతాలకు వెళ్లి ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో రోడ్లపై మురుగు నీరు నిల్వ లేకుండా ఉండేందుకు కాలువలు నిర్మించాలని, పారిశుధ్య నివారణకు చర్యలు చేపట్టి ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీలు ప్రత్యేక చర్యలు చేపట్టాలి



గ్రామాల్లో ప్రస్తుతం విపరీతంగా పెరిగి పోయిన దోమల నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. గ్రామంలో కాలువలు లేక వర్షం నీరు నిలవడంతో మురుగు ఏర్పడి దుర్వాసన వెదజల్లుతోంది. ఇటీవల దోమలు కుట్టడంతో దాదాపు 10 మంది జ్వరాలు సోకి మంచాన పడ్డారు. ఆరోగ్య సిబ్బంది, అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. రోడ్లపై మురుగు నీరు లేకుండా చేసి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– తుమ్మా లక్ష్మిరెడ్డి, బద్వీడుచెర్లోపల్లి

లోక్‌అదాలత్‌లో 13 కేసులు పరిష్కారం

పుల్లలచెరువు: మార్కాపురం కోర్టు పరిధిలో శనివారం జరిగిన లోక్‌ఆదాలత్ లో 13 కేసులు పరిష్కారం అయినట్లుగా ఎస్ఐ సంపత్‌కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసులపై అర్జీదారులకు అవగాహన కల్పించడంతో కేసులు పరిష్కారం దిశగా అడుగులు వేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా పోలీసులకు సహకరించాలని అన్నారు. వివిధ గ్రామాలకు చెందిన పుల్లలచెరువు పోలీసుస్టేషన్ పరిధిలో మొత్తం 13 కేసులు పరిష్కారం అయినట్లుగా ఎస్ఐ తెలిపారు.

ఆరు నెలలైనా హామీల అమలేది?

దర్శి: కూటమి ప్రభుత్వం హామీలు ఇచ్చి ఆరు నెలలైనా అమలు చేయలేదని కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పుట్లూరి కొండారెడ్డి విమర్శించారు. దర్శి పట్టణంలో విలేకరుల సమావేశంలో కొండారెడ్డి మాట్లాడుతూ దొనకొండ ఇండస్ట్రియల్ కారిడార్ చేస్తామని పదేళ్ళ క్రితం చెప్పారని ఆ వైపు అడుగులు పడలేదన్నారు. కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన మహిళలకు ఉచిత బస్సు హామీని ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. తాళ్లూరు మండలంలోని నెమలిగుండాల రిజర్వాయర్‌ను పూర్తి చేసి తాగు, సాగు నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముండ్లమూరులో మార్కెట్ ఎక్స్‌పోర్ట్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. ఆరు నెలలుగా మాటలు చెప్పడం తప్ప కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపడాన్ని తప్పుబట్టారు.

నీటి సంఘాల ఎన్నికలో ప్రజాస్వామ్యం ఖూనీ


గుడిపాడు 2 పోలింగ్ కేంద్రం


దర్శి : నిరసన తెలుపుతున్న కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతులు

● అధికార పార్టీ నేతలకు కొందరు అధికారులు తొత్తులుగా మారారు
● పోటీ చేసే రైతులకు నో డ్యూ సర్టిఫికెట్లు ఇవ్వకుండా కుట్రలు

దర్శి: దర్శి నియోజకవర్గంలో సాగు నీటి సంఘాల ఎన్నికల్లో అధికార టీడీపీ నేతలు, అధికారులు కలిసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీ నేతలకు దాసోహమైన కొందరు రెవెన్యూ అధికారులు.. ఎన్నికల్లో నిబంధనలకు తిలోదకాలిచ్చారు. పోటీలో ఉన్న అభ్యర్థులందరికీ ఇవ్వాల్సిన నో డ్యూ సర్టిఫికెట్లను కేవలం టీడీపీ మద్దతుదారులకే పంపిణీ చేయడం గమనార్హం. దర్శి మండలంలో సాగు నీటి సంఘాల ఎన్నికను రద్దు చేయాలని కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతులు రాచపూడి యోహాను,రాచపూడి కోటయ్య, కోల కాలు అంజయ్య, ముత్తులూరి శివారెడ్డి, ఇల్లూరి మల్లిఖార్జునరెడ్డి, కనపర్తి పిచ్చయ్య తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట రెండు గంటలసేపు శనివారం నిరసన తెలిపారు. మూడు రోజులుగా తమ పొలాలలకు పన్ను కట్టించుకోవాలని తిరుగుతుంటే సంబంధిత వీఆర్వో స్పందించలేదని యోహాన్ ఆరోపించారు. తాము పోటీ చేస్తే గెలవలేమనే భయంతోనే అధికారులతో కలిసి టీడీపీ నేతలు కుట్రలు చేశారని మండిపడ్డారు. ఈ విషయంపై తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా తమ వద్దకు పన్ను కట్టించుకోవాలని ఎవరూ రాలేదని ముక్తాయించారు. కాగా అబ్బాయిపాలెం, దర్శి, తూర్పు వీరాయపాలెం, తూర్పు వెంకటాపురం, కట్టశింగన్నపాలెం, కొర్లమడుగు, మోహిద్దీనాపురం, పాపిరెడ్డిపాలెం, పొతకమూరు, రాజంపల్లి-1, 2, రామచంద్రాపురం , శామంతపూడి, తుమ్మెదెలపాడులో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు అధికారులు ప్రకటించారు.

దొనకొండ: మండలంలో 11 చెరువుల నీటి సంఘాలలకు శనివారం ఎన్నికలు నిర్వహించారు. గంగదేవిపల్లి పంచాయతీ పరిధి పెద్దగుడిపాడు 2 నీటి సంఘం ఎన్నిక ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా జరిగింది. మాగాణి పన్ను విషయమై నో డ్యూ సర్టిఫికెట్ ఇవ్వాలని వీఆర్‌ఓను రైతులు కోరగా స్పందించలేదు. టీడీపీ నేతల ఒత్తిడితో ఫోన్ స్విచాఫ్ చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వ అప్రజాస్వామిక, నిరంకుశ విధానాలను ఎండగడతామని ఉప సర్పంచ్ కర్నాటి ఆంజనేయ రెడ్డి పేర్కొన్నారు. రుద్రసముద్రం గ్రామంలో కూటమి నాయకులే రెండు వర్గాలుగా ఏర్పడి అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవుల కోసం ఘర్షణకు దిగారు. ఎస్సై కె.విజయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని బందోబస్తు నిర్వహించారు.

కురిచేడు: మండలంలో నీటి సంఘాల సభ్యులుగా టీడీపీ మద్దతుదారులే గెలుపొందేలా పక్కా వ్యూహం రచించారు. సాగర్ కాలువ పరిధిలో 6 మేజర్, 3 మైనర్ చెరువులకు ఇతరుల నుంచి పోటీ లేకుండా టీడీపీ నేతలు పథకం రచించారు. గెలుపొందాల్సిన అభ్యర్థుల పేర్లు ముందుగానే ప్రతిపాదించడంతో ఎన్నికల అధికారులు ప్రేక్షకపాత్ర వహించారు.

కమనీయం.. రంగనాయకుని కల్యాణం


శ్రీదేవి, భూదేవి సమేత నెమలిగుండ్ల రంగనాయకస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

రాచర్ల: వేదమంత్రాల సాక్షిగా మంగళవాయిద్యాల నడుమ ముక్కోటి దేవతల దీవెనలతో నెమలిగుండ్ల రంగనాయకస్వామి కల్యాణాన్ని శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అడవుల్లో వెలసిన నెమలిగుండ్లరంగనాయకస్వామి దేవస్థానం ప్రాంగణంలో రంగనాయకస్వామి, శ్రీదేవి, భూదేవి కల్యాణాన్ని తిలకించి భక్తులు పరవశించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి బి.రమేష్‌తో పాటు ఉభయదాతలు ఒక్కొక్కరు రూ.1,516 చెల్లించి స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.


స్వామి వారి కల్యాణాన్ని తిలకిస్తున్న ఉభయదాతలు

వైభవంగా లక్ష్మీచెన్నకేశవుని కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


కల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు, భక్తులు

మార్కాపురం టౌన్: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి శాంతి కల్యాణాన్ని అర్చకులు శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు అర్చకులు, అర్చక బృందం ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అర్చన, అష్టోత్తర పూజలు చేశారు. అలాగే రాజ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయ మధ్య రంగ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉభయదేవేరులతో చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. చెన్నకేశవ స్వామివారి కళ్యాణంను వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలు కళ్యాణ ఉత్సవంలో పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయాల్లో భక్తుల సందడి


తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు

కొనకనమిట్ల: మార్గశిర మాసాన్ని పురస్కరించుకొని వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగ సమేత వెలుగొండ వెంకటేశ్వరస్వామి వారిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు అర్చనలు, అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకలు విజయకాంత్ శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వెంకటరామకృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.